RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 306 పేజీలు - 04 వెల - 05/- మంగళవారం 16 జూలై 2024

# ఒక్క ఓటమికె అంత భయమేలా జగన్..?

**జనసేన తిన్న దెబ్బలెన్నో15 రోజులు కూడా పార్టీని నడపలేరు**

**వంద శాతం సీట్లు గెలిచాం**

**జనసేనకు శత్రువులు లేరుడి : ప్యూటీ సీఎం**




ఆంధ్ర ప్రగతి మంగళగిరి జూలై 15: పవన్ కళ్యాణ్ ,సీఎంగా పనిచేసిన వ్యక్తి.. ఒక్క ఓటమితో అసెంబ్లీలో కూర్చోకుండా వెళ్లిపోయారని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌పైడిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్. కీలక వ్యాఖ్యలు చేశారు. ఓటమి.. మనిషిని అలా భయపెడుతుందని, దీనితో పోల్చితే జనసేన పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావన్నారు. మనలాగే దెబ్బలు తింటే కనీసం 15 రోజులు కూడా పార్టీ నడిపేవారా అనిపిచిందన్నారు.మంగళగిరిలో సోమవారం పార్టీ తరపున గెలిచిన ప్రజా ప్రతినిధులను జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సత్కరించారు. వైసీపీ సహా ఏ పార్టీ వారైనా ప్రత్యర్థులే తప్ప.. శత్రువులు కాదన్నారు. కక్ష సాధింపు చర్యలు ఎవరికీ మంచిదికాదన్నారు. జన బలం ఉండి, ఒక్క సీటు గెలుచుకోలేని పరిస్థితుల్లో ప్రస్తుతం 100 శాతం గెలిచామన్నారు.175 సీట్లతో పోల్చితే 21 సీట్లు పెద్ద సంఖ్య కాదని పవన్ కళ్యాణ్ అన్నారు. కూటమి 164 సీట్లు గెలవడానికి, మనం తీసుకున్న 21 సీట్లు వెన్నుముకగా నిలిచాయన్నారు. బాధ్యతలు మోసే ప్రతీ ఒక్కరికీ తాను అండగా ఉంటానని పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. ఎవరికీ భయ పడొద్దు అప్పటి పార్లమెంటు సభ్యుడు రఘురామకృష్ణరాజును హైదరాబాద్‌లో బంధించి మరీ గుంటూరు తీసు కొచ్చారని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. కస్టడీలో ఆయనను కొట్టిన తీరు దారుణమన్నారు.

మిగతా 2లో

# వైసిపి ప్రభుత్వం పంచభూతాలను సైతం మింగేసింది

## దోచుకున్నదంతా కక్కిస్తా..!



### సహజవనరుల దోపిడీపై శ్వేతపత్రం విడుదల

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 15: ఇప్పటికే పోలవరం, అమరావతి, విద్యుత్ పై శ్వేతపత్రాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా విడుదల చేసిన శ్వేతపత్రంలో.. గురించి సీఎం చంద్రబాబునాయుడు వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదులు వినూత్న పద్ధతిని ఎంచుకున్నారని సీఎం చంద్రబాబు ఆరోపించారు. గత ప్రభుత్వం అడవులను ధ్వంసం చేసిందన్నారు. ఇళ్ల స్థలాల పేరుతో భూ దోపిడీకి పాల్పడ్డారని దుయ్యబట్టారు. రీసర్వే పేరుతో భూముల హద్దుల్ని మార్చేశారన్నారు. ముఖ్యంగా విశాఖలో మాజీ ఎంపీ హయగ్రీవ భూముల్ని కాజేశారని తెలిపారు. వైఎస్సార్సీపీ భూ దందాలు, సహజ వనరుల దోపిడీపై నేడు సచివాలయంలో ఆయన శ్వేతపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ హయాంలో జరిగిన భూ దందాలు, సహజ వనరుల దుర్వినియోగం వివరాలను వెల్లడించారు. భూదందాతో పాటు, ఖనిజ సంపదను సైతం దోచేశారని విమర్శించారు. రామానాయుడు స్టూడియోకు ఇచ్చిన ల్యాండ్ ను జిల్లాస్థాయిలో నివాసస్థలంగా చూపించి బెదిరించారన్నారు.

విశాఖ, ఒంగోలు, చిత్తూరు జిల్లాల్లో గత ప్రభుత్వ పాలకులు భూ కబ్జాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. ఇళ్ల నిర్మాణం పేరుతో వైసీపీ నేతలు భూ కబ్జాలకు పాల్పడ్డారని తెలిపారు. ఒంగోలులో రూ.101 కోట్ల విలువైన భూముల్ని లాక్కున్నారు. తిరుపతిలో రూ.207 కోట్ల విలువైన భూముల్ని, చిత్తూరులో రూ.99 కోట్ల విలువైన భూముల్ని కాజేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ కార్యాలయాల నిర్మాణాల పేరుతో భూముల అక్రమాలకు తెరలేపారన్నారు. వైసీపీ నేతలు, కార్యకర్తలకు గత ప్రభుత్వం అసైన్డ్ భూములను అప్పగించిందని తెలిపారు చంద్రబాబు .గత ప్రభుత్వంలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు ఫేక్ డాక్యుమెంట్లను సృష్టించి స్థలాలను ఆక్రమించుకున్నారని శ్వేతపత్రంలో తెలిపారు. ఖనిజ సంపదను దోచుకుని.. రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. 22 %ూ% ను ఉపయోగించి తిరుపతి భూముల్ని కబ్జా చేశారని ఆరోపించారు.

# టిటిడి చైర్మన్ గా మురళీమోహన్?

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 15:
దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ధార్మిక సంస్థ టీటీడీ. దాని చైర్మన్ కు ఎంతో విలువ గౌరవం ఉంటాయి. ఒక కేబినెట్ ర్యాంక్ మంత్రికి ఉన్నంత గౌరవం దక్కుతుంది.అందుకే ఆ పదవికి అంతటి పోటీ. జగన్ సీఎం గా ఉండగా రెండు సార్లు వైవీ సుబ్బారెడ్డికి ఒక సారి భూమన కరుణాకరరెడ్డికి టీటీడీ చైర్మన్ పదవి ఇచ్చారు.తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో ఎవరికి ఈ కీలక పదవి దక్కుతుంది అన్న చర్చ అయితే చాలా రోజులుగా సాగుతోంది. రకరకాలైన పేర్లు తెర మీదకు వస్తున్నాయి. ఇపుడు కొత్తగా ప్రముఖ తెలుగు సినీ నటుడు, నిర్మాత, మాజీ ఎంపీ మురళీమోహన్ పేరు గట్టిగా వినిపిస్తోంది.ఆయన గత నాలుగు దశాబ్దాలుగా టీడీపీకి ఎంతో సేవ చేస్తున్నారు.



మిగతా 2లో

# మాజీ సీఎం జగన్ మకాం



# బెంగళూరుకు మార్చినట్టేనా.

# మహిళలపై అత్యాచారాల నిరోధానికి కఠినచర్యలు

**-క్రిమినల్స్ ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదు.**

**- శిక్షలు వెంటనే అమలు జరిపేలా చట్టాలు, ప్రత్యేక కోర్టులు**

**-నంద్యాల, విజయనగరం జిల్లాల అత్యాచార బాధితులకు ఆర్థిక సహాయం మంజూరు.**

**- హెూంశాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత వెల్లడి.**



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 15:** రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అమలు, గంజాయి, చీప్ లిక్కర్ అరికట్టే అంశాలపై ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నేడు సచివాలయంలో సమీక్షించారు అని, సమీక్షలో ముఖ్యమంత్రి చర్చించిన అంశాలను విలేకరులకు హెూం శాఖ మంత్రి వివరించారు.
నంద్యాల జిల్లా ముచ్చుమర్రి బాలిక ఘటనపై ఇప్పటికే ముగ్గురు మైనర్లు అరెస్ట్ అయ్యారని, రోజుకో మాట మార్చడంతో బాలిక మృతదేహం ఆచూకీ కూడా ఇంకా లభించలేదు, ఎన్.డి.ఆర్.ఎఫ్ బలగాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు అని, గంజాయి, మద్యం మత్తులో అత్యాచారాలు చేసే నిందితులు ఎటువంటి వారైనా వదిలే ప్రసక్తి లేదని, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి, నిందితులకు వెంటనే శిక్షలు కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవలసిందిగా సిఎం ఆదేశాలు జారీ చేశారని మంత్రి తెలిపారు. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలో ఆరు నెలల పసికందుపై వరసకు తాతైన వ్యక్తి అత్యాచార యత్నం చేయడం ఇటువంటి వ్యక్తిని సంఘంలో చూడడం దురదృష్టకర పరిణామమని, సంఘటన గురించి తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నానని, కేవలం మద్యం మత్తులో ఈ సంఘటన జరిగినట్లు నా దృష్టికి వచ్చిందని అన్నారు.
గంజాయి, నకిలీ మద్యానికి బానిసలై వావివరసలు మరచిపోతున్నారని, పోర్న్ సైట్లు కూడా మైనర్లను చెడుదోవ పట్టిస్తున్నయని, సెల్ ఫోన్లు పిల్లలకు ఇచ్చేముందు తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.
గంజాయి, నకిలీ మద్యానికి బానిసైన వారికి డి ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, ఆడపిల్లలపై అత్యాచారం చేయాలనే ఆలోచన వచ్చిందంటే భయపడేలా శిక్షలు అమలు జరిపేందుకు చట్టాలు రూపొందిస్తామని హెూం మంత్రి అన్నారు.
నంద్యాల జిల్లా ముచ్చుమర్రి అత్యాచార బాధితురాలి కుటుంబానికి పదిలక్షల రూపాయల ఆర్థిక సహాయం, విజయనగరం జిల్లా అత్యాచార బాధిత పసికందుకు ఐదు లక్షల రూపాయలు ఫిక్సిడ్ డిపాజిట్ రూపంలో ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి మంజూరు చేశారని, త్వరలోనే ఆ పరిహారాన్ని ఆ కుటుంబాలకు స్వయంగా అందజేస్తానని హెూం శాఖ మంత్రి తెలియజేశారు.

# ఏపీలో మధ్యంతర ఎన్నికలు..?

**-వైసీపీ నేత విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు.**

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 15: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వానికి వార్నింగ్ ఇచ్చారు.విశాఖపట్నంలో ఓ హెూటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన.. పార్టీ సీనియర్ నేత జూపూడి ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు. ఏపీలో మధ్యంతర ఎన్నికలు వస్తాయనే సంకేతాలను ఇచ్చారు. ఢిల్లీ రాజకీయాలపై గట్టి పట్టు ఉన్న విజయసాయిరెడ్డి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సంకీర్ణ కూటమికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ లేకపోవడం, భాగస్వామ్య పక్షాలతో బొటాబొటి మెజారిటీతో అధికారంలోకి రావడం వంటి పరిణామాల మధ్య ఎప్పుడైనా, ఏదైనా జరగొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమౌతోన్నాయి.అటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూడా తరచూ బెంగళూరుకు వెళ్లివస్తోండటం సైతం మధ్యంతర ఎన్నికల వార్తలకు బలాన్ని ఇచ్చినట్టవుతోంది. అదే సమయంలో- రాజ్యసభ సభ్యుడైన విజయసాయి రెడ్డి.. మధ్యంతర ఎన్నికల ప్రస్తావనను తీసుకుని రావడం చర్చనీయాంశమౌతోంది.



రాష్ట్రంలో మధ్యంతర ఎన్నికలు వస్తే తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. అయిదేళ్ల తరువాత ఎన్నికలు జరిగినా లేద మధ్యంతరం వచ్చినా తమ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆయన తేల్చి చెప్పారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా కూడా ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# ఉచిత విద్య ఎక్కడ!

## విద్యను వ్యాపారం చెయ్యకండి.

### -ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు.




ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 15: భారత విద్యార్థి ఫెడరేషన్ నంద్యాల పట్టణ విస్తృత సమావేశం స్థానిక టి. నరసింహయ్య భవన్ నందు నంద్యాల పట్టణ నాయకులు రఫీ అధ్యక్షణ సమావేశం జరిగింది ఈ సమావేశానికి మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు మాజీ నాయకులు పుల్లా నరసింహా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రమేష్ నాయక్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ.. నేడు దేశంలో ఉచిత విద్యను ఇవ్వవలిసిన ప్రభుత్వంమై నూతన విద్య విధానం 2020 తీసుకోని వచ్చి విద్యను వ్యాపారం చేస్తుందని వారన్నారు విద్యను వ్యాపారం చేస్తే పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులు విద్య అందని ద్రాక్షల మారుతుందిన్నారు నీట్ ను రద్దు చేసి అందరికి ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలన్నారు. రాష్ట్రములో డిగ్రీలో బీకామ్ కోర్సు ని కొనసాగించాలిని జీవో29 రద్దుచేసి అర్హులైన అందరికి తల్లి వందనం ఇవ్వాలని నంద్యాల పట్టణంలో పాలటెక్ని కళాశాలకు బాలుర వసతి గృహం ఏర్పాటు చెయ్యాలని కార్పొరేట్ స్కూల్స్ కళాశాల ఆర్థిక దోపిడీని అరికట్టాలని విద్య సం ప్రారంభం అయి రెండు నెలలు కావస్తున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సరిగ్గా అందలేదు తక్షణమే పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి ని డిమాండ్ చేశారు నిరద్యోగభృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు ముచ్చుమరి లో చిన్నారి అదృశం అయ్యి వారాలు కావస్తున్న చిన్నారి అడుగుజాడలు ఇప్పటికి తెలియకపోవడం రాష్ట్ర ప్రభుత్వం విఫలంమై అని వారున్నారు చిన్నారి కుటుంబనికి 30లక్షలు, వారి కుటుంబం లో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలిని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో %ంటఱ% నంద్యాల నాయకులు బన్ని, సాయి, గణేష్, తేజ మరియు తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగ అస్త్రమే ఓటుహక్కు.!

### - పాలకులు ఇది మరిస్తే దండన తప్పదు

### -రాష్ట్రస్థాయి సదస్సులో ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్ చందర్.



ఆంధ్ర ప్రగతి గుంటూరు, జూలై 13: చరిత్ర నిద్రా సముద్రం నుంచి పెను తుపానులా లేవగల అస్త్రం రాజ్యాంగమనేది ఒకటుందనే విషయాన్ని పాలకులు, ప్రజలు మరువరాదని ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్ చందర్ అన్నారు. బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన గోరంట్లలోని డి స్క్వేర్ కన్వెన్షన్ హాల్లో శనివారం 'రాజ్యాంగమే ప్రతిపక్షమా? (జడ్జిమెంట్ 2024)' అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన తొలి సెషన్ 'లోక్ సభలో సంకీర్ణం రాజ్యాంగ విజయమేనా?', మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్ 'తెలుగు రాష్ట్రాల ఫలితాలలో కుల సమీకరణాలు – కుటుంబ రాజకీయాలు' అంశాలపై సతీష్ చందర్ ప్రధాన వక్తగా ప్రసంగించారు.

ప్రజలు స్పష్టమైన, తిరుగులేని, బ్రూట్ మెజారిటీలు ఇచ్చి ఆయా పార్టీల నేతలను చట్టసభలకు పంపితే వైరిపక్షాలను చంపేస్తున్నారని ఆయనన్నారు. ప్రతిపక్ష సభ్యులను చిన్నబుచ్చుతున్నారని, ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో వారిని అడ్డంగా కొనేస్తున్నారనీ గుర్తుచేశారు. కేంద్రంలో, రాష్ట్రాల్లోనూ ఇదే తంతు సాగుతోందని చెప్పారు. సక్రమంగా పాలించమని ప్రజలు మెజారిటీ ఇస్తే రాజ్యాంగ సంస్థలను కీలుబొమ్మల్ని చేశారని, దర్యాప్తు సంస్థల్ని కుళ్ళబొడిచారని వివిధ సంఘటనల్ని ప్రస్తావించారు. న్యాయవ్యవస్థ వెన్నువిరిచారని, మీడియా సంస్థల నోళ్ళునొక్కారనీ చెప్పారు. శత్రుపక్ష నేతల్ని జైళ్ళలో వేశారని, అణగారిన వర్గాలను అధఃపాతాళానికి తొక్కేశారన్నారు. రైతులు తమ దీర్ఘకాల సమస్యలపై యేడాదికి మించి దేశ రాజధాని ఢిల్లీలో రోడ్లపై బైఠాయిస్తే వారిపై 'ఉగ్రవాద' ముద్ర వేశారన్నారు. ఆదివాసులు అడవి తమదేనని బహుళజాతి సంస్థల్ని అడ్డుకుంటే 'తీవ్రవాదులు'గా నిందలు మోపారన్నారు. విద్యార్థులు క్యాంపస్ దాటితే నిరుద్యోగ రాక్షసిని ఉసిగొల్పారని, పొరపాటున పోటీ పరీక్షకు వెళితే 'పేపర్ లీకు'లతో కుళ్ళబొడిచారని ఆయన ధ్వజమెత్తారు. పాలకులు తాము ఆడిందే ఆట, పాడిందే పాట అని భ్రమించారే కానీ, చరిత్ర నిద్రా సముద్రం నుంచి పెను తుపానుగా లేవగల అస్త్రం రాజ్యాంగం ప్రజల నిర్ణాయక శక్తిగా, సమయం వచ్చినపుడు శాసించే ఓటుహక్కుగా వుందనే విషయాన్ని మరిచారని ఆయన వ్యాఖ్యానించారు. "ఆపద వచ్చినపుడు ప్రయోగించడానికి అంబేద్కర్ ఈ దేశం వోటరు చేతిలో రాజ్యాంగ ఆయుధం పెట్టారు. కార్పొరేట్ సంస్థలకు సంచులిచ్చి, పేదల ముఖాన పింఛను కొట్టిన నడమంత్రపు నియంతలపై వోటరు ఆ ఆయుధాన్నే ప్రయోగించాడు. అదే 2024 ఎన్నికల తీర్పు" అని సతీష్ చందర్ వివరించారు.

ఈ సందర్భంగా దేవరకొండ లలితా వెంకటేశ్వర్లు సంకలనం చేసిన 'భారత రాజ్యాంగం' గ్రంథాన్ని పరిచయం చేశారు. ఈ సదస్సులో సీనియర్ పాత్రికేయులు నిమ్మరాజు చలపతిరావు, బ్లూ వింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి మల్లికార్జునరావు, ప్రధాన సలహాదారు డాక్టర్ శివరామకృష్ణారావు, ప్రధాన సాంకేతిక, న్యాయ సలహాదారు బోడపాటి సుధీర్ కుమార్, పత్రికా–సాంస్కృతిక కార్యదర్శి సిహెచ్ రాజేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఏక్షగ్రేషియా కాదమ్మ హెూంమంత్రి గారు

# వాసంతి ఆచూకీ

### బ్రతికుంటే అమ్మాయి,చచ్చిఉంటే శవం.

### -ఎంవిఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులికొండన్న.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 15:**

హెూంమంత్రి అనిత ఈ రోజు మీడియాతో మాట్లాడుతూ ముచ్చుమర్రిలో 7వ తేదీన ఆచూకీ తెలియకుండా పోయిన మైనర్ బాలిక వాసంతి కుటుంబానికి 10లక్షల ఎక్స్ గ్రేసియా ఇవ్వనున్నట్లు ప్రకటించటం భాదకరమని వెంటనే ఆ మాటను వెనక్కు తీసుకోవాలని ఎంవిఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న అనిత కి విజ్ఞప్తి చేశారు. ఆయన ఈ రోజు సాయంత్రం స్థానిక బొగ్గులైన్ ప్రాంతంలో మాట్లాడుతూ.. 7న వాసంతి ముచ్చుమర్రిలో మిస్సయిందని అదే రోజు పిర్యాదు చేస్తే, 8న కేసునమోదు చేసుకొని విచారణ మొదలు పెట్టి, ఈ రోజువరకు ఆచూకీ కనుక్కోలేదని అటువంటి సందర్భంలో ఏక్షగ్రేషియా ప్రకటించటం న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. ముందు అమ్మాయి ఆచూకీ కనుక్కుని దోషులను శిక్షించాలని,మైనర్ బాలురు ముగ్గురిని గుర్తించి విచారిస్తే రేప్ చేసి కాలువలో పడేశామని ఒకసారి,ఇంకో సారి పుర్చి పెట్టామని చెబుతూ రోజుకో స్విస్టు ఇస్తూ 8 రోజులైనా అధికారులు ఆచూకీ కనుక్కోలేక పోతున్నారని ఇందులో ఎవరి పాత్ర ఎంత,పిల్లల తల్లిదండ్రుల పాత్ర కూడా ఉందని ఆరోపణలు వస్తున్న దృష్ట్యా ముందు త్వరగా వాసంతి ఆచూకీ కనుక్కుని తల్లి తండ్రులకు అప్పజెప్పి ,బాధితులను ఎనుకౌంటర్ చేసి ప్రభుత్వం వారిని అందుకుంటే బాగుంటుందనిఅలాకాకుండా ఏక్షగ్రేషియా ప్రకటించి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తే తీవ్రంగాఅడ్డుకుంటాం,రాష్ట్రస్థాయిలో ప్రచారాలు నిర్వహిస్తామని బోయపులికొండన్న తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండల నాయకులు ఈశ్వరయ్య,పట్టణ నాయకులు శేఖర్ ,రవి మహిళా నేతలు మల్లీశ్వరి,రమాదేవి,గుర్రమ్మ, లింగమ్మ,కవిత, సరస్వతి,లక్ష్మిదేవి, అరుణ ,సుజాత ,మంగ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతసుఖీభవ పథకము క్రింద 20,000 రూ" తక్షణమే రైతులకు అందించాలి

### -జిల్లా నాయకుడు గాలి రవిరాజ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 15:**



నంద్యాల పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం లో ప్రజా దర్బార్లో కలెక్టర్ కి రైతు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు అనంతరం సిపిఐ (యం యల్ )లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా రైతులు వరుస విపత్తులతో, కరువుకాటకాలతో నిత్యము పంటలు సాగు చేసి అప్పులు పాలవుతున్నారని ఏంతమంది పాలకులు వచ్చినా పాలకులు రాతలు బాగున్నాయి తప్ప రైతుల తలరాతలు మాత్రము చిద్రము అవుతున్నాయని వరుసగా ఖరీఫ్ లో నష్టపోతే పంటలుభీమా, లేదు,కదా కనీసం అరకోరగా పంటనష్టపరిహరము, కరువు మండలాలు గా ప్రకటించినారు కాని రైతులకు పలితము మాత్రం శూన్యమని రభీలోకూడ కరువుమండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకున్నారు. తప్ప ఇంతవరకు సహయచర్యలు చేపట్టలేదని రైతులు పరిస్థితి రాను, రాను పాలకులపై నమ్మకమునన్నగిల్లుతున్నది. సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి గత అయిదు సంవత్సరములలో ఒక్కరూపాయి కూడ నిధులు కేటాయించక పోవడం వలన రైతులు చాలా నష్ట పోయారని ఈ ప్రభుత్వమైనా రైతులు అన్నివిధాలుగా అధుకోవాలని సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతుకు 20 వేలు ఈ ఖరీఫ్ సీజన్లోనే అందించేందుకు కృషి చేయాలని పెరిగిన ఉత్పత్తి ఖర్చుల కనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు 3 లక్షల వరకు వడ్డీలేకుండా 5 లక్షల వరకు పావలా వడ్డీతో ఇవ్వాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలని రాష్ట్రంలోని ప్రాజెక్టుల క్రింద ఉన్న ప్రధాన కాలువలు, మేజర్, మైనర్ కాలువలతోపాటు డెల్టా ప్రాంతాల్లోని మురుగు నీటి కాలువుల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతాంగానికి చెల్లించాల్సిన నిధుల బకాయలపై శ్వేతపత్రం విడుదల చేయాలని గత రబీ కాలంలో ప్రభుత్వం సేకరించిన ధాన్యం బకాయిలను రైతాంగానికి వెంటనే చెల్లించాలని నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దు పరచాలని ఖరీఫ్ సాగుకు అవసరమైన పచ్చిరొట్టె, విత్తనాలు, వరి, వేరుశనగ, కంది తదితర విత్తనాలను 90% శాతం సబ్సిడీ పై రైతులకు అందించాలని వ్యవసాయానికి అవసరమైన పనిముట్ల కొనుగోలుపై 50%శాతం సబ్సిడీ పై అందించాలని జిల్లా వ్యాప్తంగా కల్తీ విత్తనాలను అరికట్టి కల్తీ విత్తనాలను అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో మార్పులు తేవాలని పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక నిధులు కేటాయించి వర్షాకాలం ప్రారంభమైనందున మొక్కలు నాటే విధంగా ప్రభుత్వం యుద్ధప్రాతి పాదికాన చర్యలు చెపటాలని సేద్య పరికరాలకు 90%శాతం సబ్సిడీతో రైతులకు అందించి అటవీ జంతువుల దాడిలో మరణించిన రైతు కుటుంబాలకు 15 లక్షల రూపాయలు గాయపడిన వారికి 5లక్షల ఎక్స్ గ్రేసీయా చెల్లించాలని నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు 30వేలు వాణిజ్య పంటలకు ఎకరాకు 75వేలు ఉద్యాన పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని గత సంవత్సరంలో రబీ కాలంలో కరువు వలన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించి పంటలకు భీమా నిధులు విడుదల చెయ్యాలని వారు డిమాండ్ చేశారు. గతంలో టీడీపి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ 4,5 విడతల బకాయిల తరువాత వచ్చిన వైస్సార్సీపీ ప్రభుత్వం చెల్లించ లేదని నూతన టిడిపి ప్రభుత్వం 4,5 విడతల రుణమాఫీ నిధులను విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కౌలు రైతుల సాగు సాయం ఎకరాకు పదహేను వేలు ఇవ్వాలని రాష్ట్రంలో అప్పుల బారిన పడిన రైతు కౌలు రైతు అన్ని రకాల పంట రుణాలను రద్దు చెయ్యాలని ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చెయ్యాలని వారు డిమాండ్ చేశారు.

## అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.



ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూలై 15: ఆళ్లగడ్డ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను సోమవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో విద్యతోపాటు విద్యార్థులకు ప్రభుత్వ నిర్దేశిత మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా .. పాఠశాలలో నెలకొన్న సమస్యలను గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే అఖిలప్రియ తమ వ్యక్తిగత ఫోన్ నెంబర్ ను విద్యార్థినులకు ఇచ్చి ఏమైనా సమస్యలు ఉంటే తనకు ఫోన్ చేయాలని తెలిపారు.పాఠశాల తరగతి గదులను, హాస్టల్, వంటశాలలను ఆమె తనిఖీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మీడియాతో మాట్లాడుతూ.. పాఠశాల గురించి పాఠశాల సిబ్బంది క్రమశిక్షణతో మెలగాలని ఏ చిన్న ఫిర్యాదు తమ దృష్టికి వచ్చినా సహించేది లేదన్నారు. పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబును ఆదేశించారు.విద్యార్థులకు అందించే భోజనం విషయంలో కూడా తాము చాలా నిక్కచ్చిగా ఉంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసే స్వీపర్లు తమకు జీతాలు సక్రమంగా అందడం లేదని ఎమ్మెల్యే అఖిల ప్రియ దృష్టికి తీసుకొని రాగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి బకాయి ఉన్న జీతాలను ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేభూమా అఖిల ప్రియ తెలిపారు.

## ఒక్క ఓటమికె అంత భయమేలా జగన్..?

అంతేకాదు నాలుగు దశాబ్దాలుగా పని చేసిన ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబును జైలులో పెట్టించారన్నారు.

ఇలాంటి నేపథ్యంలో ఐదు కోట్ల మందికి వెన్నుదన్నుగా జనసేన నిలిచిందన్నారు. రోడ్ల మీదకు రావాలంటే ఒకప్పుడు భయపడేవాళ్లమని, ప్రజల గుండెల్లో ధైర్యాన్ని నూరి పోశామన్నారు. బాధ్యతలు మోసే ప్రతీ ఒక్కరికీ తాను అండగా ఉంటానన్నారు. పనిలోపనిగా కార్యకర్తలను సున్నితంగా హెచ్చరించా రు జనసేనాని. మనకు సంస్కారం కావాలని, రౌడీయిజంతో భయపెట్టాలని చూస్తే వదులుకునేందుకు సిద్ధమన్నారు జనసేనాని. నా మాటలను మంచి మనసుతో అర్థం చేసుకోవాలన్నారు. మహిళా నేతలను సోషల్‌మీడియాలో కించపరిచినా యాక్షన్ తప్పదన్నారు.పార్టీని అంచెలంచెలుగా పెరిగేలా చేయడంలో అధినేత పవన్ కల్యాణ్ చాలా ఓపికతో.. వ్యూహంతో వ్యవహరించారని జనసేన పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్‌అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో ఉన్నాం.. మిత్రపక్షాలతో సమన్వయంతో వెళ్లాలన్నారు.. క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బంది.. మచ్చ రాకుండా అందరూ పని చేయాలని సూచించారు.. పదవులు మనకొచ్చాయి.. కానీ, మనకోసం పని చేసిన జనసైనికులు, వీర మహిళలను మరువద్దు అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి. పార్టీ మీద, ప్రభుత్వం మీద దుష్ప్రచారం మొదలు పెడతారు.. తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

# టిటిడి చైర్మన్ గా మురళీమోహన్

అన్న ఎన్టీఆర్ పిలుపుని అందుకుని రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీ కోసం ఎపుడూ ముందుంటే వ్యక్తిగా సౌమ్యుడిగా వివాదరహితుడిగా పేరు ఉంది. ఆయన వయసు ఇపుడు 84 ఏళ్ళు. ఇదిలా ఉంటే తన జీవిత కాలంలో స్వామి వారిని సేవ చేసుకునే అదృష్టం కలిగించాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుని కలసి మురళీమోహన్ రిక్వెస్ట్ చేశారు అని అంటున్నారు. పాలిటిక్స్ కి కూడా ఆయన 2019లోనే స్వస్తి చెప్పిన నేపథ్యంలో ఆధ్యాత్మిక పదవిని చేపట్టి తృప్తికరంగా అధికారిక పదవుల నుంచి రిటైర్ కావాలని అనుకుంటున్నారు అని తెలుస్తోంది. దానిని చంద్రబాబు కూడా ఆమోదముద్ర వేశారు అని అంటున్నారు. టీటీడీకి సరైన నాయకత్వం వహించేవారు కావాలన్నది కూడా టీడీపీ ఆలోచనగా ఉంది అంటున్నారు.

మరో వారం రోజులలో టీటీడీ చైర్మన్ కి సంబంధించి మురళీమోహన్ నియామకం మీద అధికారిక ఉత్తర్వులు వస్తాయని అంటున్నారు. మరి కొన్ని నామినేటెడ్ పదవుల భర్తీతో పాటుగానే టీటీడీ పోస్టులను భర్తీ చేస్తారు అని అంటున్నారు.ఈ నేపథ్యంలో నామినేటెడ్ పోస్టులు టీటీడీ చైర్మన్ పోస్టు గురించి కూడా చంద్రబాబు జనసేన బీజేపీ మిత్రులతో చర్చించి ఒక తుది నిర్ణయం తీసుకుంటారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే టీటీడీ చైర్మన్ పదవి విషయంలో టీడీపీలోనే అనేక మంది సీనియర్లు ప్రయత్నాలు చేస్తూ వచ్చారు.చంద్రబాబు అయితే కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు పేరుని అనుకున్నారు అని వార్తలు వచ్చాయి. అలాగే సినీ ప్రముఖులు కె రాఘవేంద్రరావు, సి అశ్వనీదత్ పేర్లు కూడా నలిగాయి. కానీ చంద్రబాబు మాత్రం చివరికి మురళీ మోహన్ కే ఓటు వేశారు అని అంటున్నారు. ఆయన పార్టీకి వీర విధేయుడు కావడమే కాదు ఎన్టీఆర్ కుటుంబానికి సన్నిహితుడు అని అంటున్నారు. సో మురళీమోహన్ కొత్త చైర్మన్ గా టీటీడీకి రాబోతున్నారు అని అంటున్నారు.

# జిల్లా కలెక్టరు గారు పాణ్యం డిగ్రీ కళాశాలను

# మీరైనా పట్టించుకోండి మేడం.!

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 15:
పాణ్యంలో నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థి ప్రజా సంఘాలు ఎన్నో పోరాటాలు ధర్నాలు చేస్తే గత రెండు సంవత్సరాల కిందట పాణ్యం లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. మేము 45 మంది విద్యార్థులం ఉన్నాము. ఇక్కడ పేరుకు మాత్రమే కాలేజీ అని అందులో పరికరాలు లేవు, విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు లేవు త్రాగుటకు నీరు లేరు ముఖ్యంగా మహిళలకు బాత్రూం లేవు లైబ్రరీ లేవు చాలా ఇబ్బందులు పడుతున్నాం. పాతవి స్కూల్ కు సంబంధించినవి రెండు రూములు కలవు. అని అవి కూడా పైన పెచ్చులు ఊడి కింద పడుతూ ఉన్నాయి. మేము అధ్యాపకులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినలేకపోతున్నాం. పై నుండి పెచ్చులు ఎప్పుడు ఊడి మా మీద పడతాయో అని భయంతో ఉంటున్నాము. ఈ విషయంపై అధికారులకు ఎన్నోసార్లు తెలియజేసిన ఏ అధికారి కూడా పట్టించుకోవడం లేదు. కావున ఈరోజు రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలోరాయలసీమ వ్యవస్థాపకుడు రామినేనిరాజునాయు డు,నంద్యాల జిల్లా రాష్ట్ర కార్యదర్శి బతిని ప్రతాప్ లు కలెక్టర్ జి. రాజకుమారి గారికి వినతిపత్రం ఇవ్వటం జరిగింది.
అందులో 1.పాణ్యం లో,ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయించి నూతన బిల్డింగ్ ఏర్పాటు చేయాలి.



2. పాణ్యం లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం, ఐదవ తరగతి నుండి డిగ్రీ వరకు మహిళా సంక్షేమ హాస్టల్లో ఏర్పాటు చేయాలి.
3.. మౌలిక సదుపాయాలు కల్పించాలి.
4. ఖాళీగా ఉన్న అధ్యాపకులను నియమించాలి సీనియర్స్ ( అనుభవం ఉన్న ) అధ్యాపకులను నియమించాలి.
5.విద్యార్థులకు కంప్యూటర్ ల వసతి ఏర్పాటు చెయాలి.
కలెక్టర్ గారు వెంటనే స్పందించి. ఒక వారం రోజుల లోపు పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వచ్చి పరిశీలించి మీకు అన్ని వసతులు కల్పిస్తాము అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాజు, విష్ణు, కార్తీక్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 15:
భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని,సంక్షేమ బోర్డు నిధులు 2000 కోట్లు సంక్షేమ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం జమ చెయ్యాలని అర్హులైన భావన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం పెండింగ్ క్లైములు పరిష్కారం చేయాలని గుర్తింపు ఇప్పటికే సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు ఈ శ్రమ పోర్టల్ లో నమోదు చేసుకున్న కార్మికులకు విశ్వకర్మ యోజన అమలు చేయాలి అని జిల్లా కలెక్టర్ గారికి గ్రీవెన్స్ లో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం నంద్యాల జిల్లా సిఐటియు కార్యాలయంలో ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కే భాష తిమ్మయ్య ల అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి ఏసురత్నం ఏ నాగరాజు ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శిబాల వెంకట్ లు మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వ భవన నిర్మాణ కార్మికులు సమస్యలు పరిష్కారం చేయడంలో, సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించడంలో నిర్లక్ష్యం చేసిందని. వై ఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులు చేస్ ద్వారా బోర్డులో ఉన్న 2000 కోట్లు




గతరాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు దారి మళ్లించి మా కార్మికులు సంక్షేమానికి తూట్లు పొడిచిందన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు అందకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మరో వైపు కరోనా కాలం నుంచి నేటి వరకు భవన నిర్మాణ కార్మికులు కు పనులు కల్పించడంలో ఆదుకోవడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. జీఓ 12,13 ను విడుదల చేసి పని లేకుండా చేసిందన్నారు. 30 లక్షలు మంది కార్మికులు జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం జీఓ 12,13 ను విడుదల చేసి పని లేకుండా చేసిందన్నారు. 30 లక్షలు మంది కార్మికులు జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటుందన్నారు.తమిళనాడు,కేరళ, ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులు కు సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలు చేయకపోవడం దారుణమన్నారు. సంక్షేమ బోర్డు ను సమర్థ వంతంగా నిర్వహించాలని, ఉపాధి కి నష్టం చేసే మెమో 12,13 లను రద్దు చేయాలని,మా డబ్బులు 2000 కోట్లు బోర్డుకు జమ చేసి,సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.
కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాముడు రషీద్ వలి జాకీర్ జలీల్ భాష శేషు అబ్దుల్ ఈరన్న తోపాటు జిల్లాలోని వివిధ మండలాల నుండి బిల్డింగ్ కార్మికులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న నాడు నేడు పనులను త్వరగా చేపట్టాలి

**-గత ప్రభుత్వంలో నాడు నేడు లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 15:
గత ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి కోసం నాడు నేడు ద్వారా బడ్జెట్ విడుదల అయ్యి ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న పనులను ఈ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు నంద్యాల పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాం ఈ ధర్నాకు జిల్లా అధ్యక్షుడు పవన్ అధ్యక్షత వహించారు.
అనంతరం కలెక్టర్ రాజకుమారి కి పి డి ఎస్ యు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది.
స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని మరియు నాడు నేడు లో ఎవరైతే అక్రమాలు చేసారో వారిపై విచారణకు




ఆదేశిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా పెండింగ్ లో వున్నా నాడు నేడు పనులను త్వరగా చేపట్టాలని పీ డీ ఎస్ యూ గా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం గత ప్రభుత్వం నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేస్తామని చెప్పి మధ్యలోనే పనులను ఆపేసిందని దాని వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేస్తున్నాం పాఠశాలలో తరగతి గదులు పూర్తి కాక విద్యార్థులు చెట్ల కింద విద్యను అభ్యసిస్తున్నారని ఆ పనులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలని కోరుతున్నాం గత ప్రభుత్వం నాడు నేడు కు దాదాపుగా 300 కోట్ల వరకు బడ్జెట్ కేటాయించిందని కానీ ఇసుక కొరత వల్ల ఎక్కడి పనులను అక్కడి నిలిపివేసిందని అందులో చాలా అక్రమాలు జరిగాయని వాటి పైన కూడా విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు మరియు సంక్షేమ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్ లో మెస్,కాస్మోటిక్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని హస్టల్ లకు సన్న బియ్యం సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మానవ మృగాల చేతిలో హత్యకు గురై మృతి చెందిన వాసంతి కుటుంబానికి న్యాయం చేయాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 15:
నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం ముచ్చుమర్రి గ్రామంలో మానవ మృగాలు చేతిలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ విద్యార్థుల చేతిలో అత్యంత దారుణంగా అత్యాచారం , హత్య చేసి మృతదేహాన్ని మాయం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారికి జేఏసీ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వాసంతికి న్యాయం జరగాలని నిరసన , ధర్నా కార్యక్రమాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా నంద్యాల విద్యార్థి , యువజన , ప్రజా సంఘాల నేతలు రామినేని రాజునాయుడు , బందెల ఓబులేసు , శేక్ రియాజ్, జయరాజు , మధు కిరణ్ , నాగార్జున , నాగసారి సుంకన్న , రవీంద్ర నాయక్ , బత్తిని ప్రతాప్ , శేక్ ఫకూర్ , పవన్ కుమార్ , అక్రమ్ తదితరులు మాట్లాడుతూ..చిన్నారి వాసంతి మృతికి కారణమైన ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.వాసంతి కుటుంబానికి 25 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా , ఇద్దరి పిల్లలకు ఉచిత విద్య , కుటుంబానికి ఐదు ఎకరాల పొలం , కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నేతలు డిమాండ్ చేశారు.

# కుష్టు వ్యాధులను గుర్తించే కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.

**-వైద్య సిబ్బందిని ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 15:
ఈ నెల18వ తేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాల్లో పిజిఆర్ఎస్ పరిష్కార వేదిక లో భాగంగా జాతీయ కుష్టి వ్యాధి నిర్మూలన కార్యక్రమ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్వో ఏ పద్మజ, ఇతర వైద్యాధికారులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే కుష్టు వ్యాధిగ్రస్తులను ఈనెల 18వ తేదీ నుండి ఆగస్టు రెండో తేది వరకు ఇంటింటికి వెళ్లి గుర్తించే విధంగా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఆదేశాలు జారీ చేయాలని డీఎంహెచ్వో ను ఆదేశించారు. కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించే విధానంపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. గుర్తించిన అనంతరం ఏ విధమైన చికిత్సలు అందించాలి, మందులు వాడే విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యశాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలను సమన్వయం చేసుకొని చురుకుగా పనిచేయాలని ఆమె ఆదేశించారు. అలాగే కుష్టు వ్యాధి లక్షణాలను వున్న వ్యక్తిని ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందించడం ద్వారా వ్యాధిని అరికట్టి, అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో 02 నుంచి 06 సంవత్సరాల వయసు పిల్లలను, అన్ని పాఠశాలల్లోని పిల్లలను, సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు, కళాశాల విద్యార్థులకు కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ, పట్టణ వార్డులలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేస్తూ పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటరమణ, డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్ %ఁ% టిబి అధికారి యం.శారద బాయి కుష్టు వ్యాధి లక్షణాలు తెలియచేశారు. మల్టి డ్రగ్ థెరపీ చికిత్స ద్వారా కుష్టు వ్యాధి త్వరగా నయం అవుతుందని తెలియచేస్తూ, ఈ మందులు ప్రతి ప్రాథమిక మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా లభిస్తాయని తెలిపారు. అలాగే ఈ సర్వేను జిల్లాలో 1610 టీమ్స్ ( టీం నందు 1 ఆశా మరియు 1 మేల్ వాలంటీర్స్ వుంటారు) తో సర్వే చేయించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించు కోవాలని కలెక్టర్ తెలిపారు.

# భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారినికై ఉద్యమిద్దాం.

**-భవన నిర్మాణ రంగం కార్మికులు(ఐ. ఎఫ్.టి.యు అనుబంధం)నూతన కార్యాలయం ప్రారంభించిన పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 15: భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సమస్యలు పరిష్కారానికై పోరాడుదామని పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ అన్నారు.సోమవారం నాడు నంద్యాల పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో అనుబంధ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నూతన కార్యాలయాన్ని పిడిఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ .ఎం. డి రఫీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా నంద్యాల డివిజన్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మురళీకృష్ణ సమీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడి.ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్. ఎం. డి రఫీ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన మరియు ఇతర నిర్మాణ రంగ కార్మికులు సమస్యలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ఇసుక పంపిణీ విధానం వలన వారి భవిష్యత్తు అంధకారంలో నెట్టివేయబడిందని తెలిపారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ఇసుక పంపిణీలో ఎటువంటి షరతులు లేకుండా చూసి భవన నిర్మాణ రంగాన్ని ఆదుకోవాలని కోరారు.



# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

## -రీఓపెన్ అయిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించండి.
## -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణీయా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 15:

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎ.పద్మజ, జిల్లా అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంపై అర్జీదారులకు అధికారులు ఇచ్చిన ఎండార్స్మెంట్లు మొక్కుబడి రీతిలో ఉన్నాయే తప్ప సరైన రీతిలో ఎండార్స్మెంట్ ఇవ్వడం లేదన్నారు. సంబంధింత సమస్యకు ఖచ్చితమైన పరిష్కారం లేదా పరిష్కరించకపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తూ అర్థమయ్యే రీతిలో ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. రీఓపెన్ అయ్యే దరఖాస్తులపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో విచారణకు సంబంధించిన ఫోటోలు అప్లోడ్ చేసే దాఖలాలే కనబడటం లేదని ఆమె వివరించారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ లో 7, రెవెన్యూలో 5, ల్యాండ్ అండ్ సర్వేలో 2, పోలీస్ డిపార్ట్మెంట్లో ఒక దరఖాస్తు బియాండ్ ఏస్ఎల్ఏ లో ఉన్నాయని వీటన్నిటిని స్వయంగా పరిశీలించి క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ సర్వీస్ లకు సంబంధించి సివిల్ సప్లైస్, పంచాయతీరాజ్, స్థానిక సంస్థలకు సంబంధించిన సమస్యలను సచివాలయాల వారీగా ఎంపీడీఓలు విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన పిటిషన్ లె అధికంగా వస్తున్నాయని... మండల, డివిజన్ స్థాయిలో రెవిన్యూ అధికారులు చురుకుగా పనిచేసి పరిష్కరించాలన్నారు. వచ్చేవారం నుండి రెవిన్యూ శాఖకు వచ్చే దరఖాస్తులు తగ్గుముఖం పట్టాలని ఆర్డీఓలు, తాసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

**పిజిఆర్ఎస్ లో స్వీకరించిన కొన్ని సమస్యలు**

1) బనగానపల్లె మండలం పాత కందుకూరు గ్రామానికి చెందిన శేఖర్ తన పొలం గ్రామ పొలిమేరన సర్వే నంబర్ 664/1 లో 9 ఎకరాల 75 సెంట్ల భూమి ఉన్నదని... ఇందుకు సంబంధించి ఆన్లైన్లో మరియు పట్టాదారు పాసు పుస్తకాలు లేవని మా సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు.
2) నంద్యాల పట్టణానికి చెందిన కోటేశ్వరరావు గోకులం ప్రాజెక్ట్ పట్టణంలో గోకులం ప్రాజెక్టు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి మంజూరు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు.
3) గడివేముల మండలం ఎల్.కే తాండా గ్రామ వాస్తవ్యులు లక్ష్మణ్ నాయక్ మరియు శంకర్ నాయక్ లు ఎల్.కే తాండా నందు పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నామని.... అయితే మాకు 35 నెలలు గా జీతాలు ఇవ్వడం లేదని, కుటుంబ పోషణ భారంగా వుందని జీతాలు వచ్చేటట్లు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో 161 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.
అంతకుముందు సెంటనరీ హాల్ ఆవరణంలో పిజిఆర్ఎస్ అర్జీల ఎంట్రీ విధానాన్ని పరిశీలించి సంబంధిత సిబ్బందికి కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు.

---

# శ్రీమతి దుర్గా భాయ్ దేశ్ ముఖ్ సేవలు చిరస్మరణీయం

## -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ.





ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 15:
జూలై 15 న స్వాతంత్ర్య సమరయోధురాలు శ్రీమతి దుర్గాభాయ్ దేశ్ ముఖ్ జయంతి సందర్భంగా డోన్ పట్టణం లోని సిద్ధార్థ స్కూల్ నందు సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో స్కూల్ హెచ్ బి రామకృష్ణ అధ్యక్షతన స్వాతంత్ర్య సమరయోధురాలు శ్రీమతి దుర్గాభాయ్ దేశ్ ముఖ్ జయంతి పురస్కరించుకుని వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు.వారిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం బి రామకృష్ణ సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫీ మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ పేర్కొన్నారు.శ్రీమతి దుర్గాబాయి దేశ్ముఖ్ పేరు పొందిన స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సంస్కర్త మరియు రచయిత్రి. ఈమె 1909వ సంవత్సరం జూలై 15వ తేదీన రాజమండ్రిలో కృష్ణవేణమ్మ, రామారావు దంపతులకు దుర్గాబాయి జన్మించారు. ఈమె బాల్యం నుండీ ప్రతిభాపాఠవాలను కనబరుస్తూ హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్నివయసులవారికీ విద్యాబోధన అందించేవారు.బెనారస్ విశ్వవిద్యాలయం నుండి మెట్రి క్యులేషన్, ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ , ఎల్.ఎల్.బి పూర్తిచేసింది.దుర్గాబాయి చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకుంది. తెలుగుగడ్డ పై మహాత్మా గాంధీ రాకను పురస్కరించుకుని 12 ఏళ్ళ వయసులోనే ఈమె విరాళాలను సేకరించి ఆయనకు అందజేసింది. శ్రీ మహాత్మ గాంధీ కి తన వంతుగా తన చేతులకు ఉన్న బంగారు గాజులను కూడా విరాళంగా అందించింది. స్త్రీల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేసిన దుర్గాభాయికి ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది మరియు పద్మ విభూషణ్ ,నెహ్రూ లిటరసీ అవార్డు, యునెస్కో నుండి పాల్ జి హాఫ్మన్ అవార్డు పొందిన మహోన్నతమైన స్త్రీ మూర్తి. ఈమె మే 9 - 1981 న స్వర్గస్తులైనారు. ఇలాంటి మహనీయులైన స్వాతంత్ర్య సమరయోధులను ఎల్లవేళల స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలన్నారు.

---

# నంద్యాల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అధిరాజ్ సింగ్ రాణా

**-నంద్యాల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తాం.**
**-స్త్రీ, శిశు రక్షణకు పెద్ద పీట వేస్తాం. -పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట.**
**-పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.**
**-జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 15:
ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ నందు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (%వాడూ%) గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా ఎస్పీగా బదిలీ కావడం జరిగింది. ఈ సందర్భంగా నేడు నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించడం జరిగింది.
నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా 2018 బ్యాచ్ కి చెందిన ఐపీఎస్ అధికారి.హైదరాబాద్ నందు ఐపీఎస్ ట్రైన్ తర్వాత అనంతపురం జిల్లా ట్రైనీ ఐపీఎస్ గా విధులు నిర్వహించడం జరిగింది.
అనంతరం గ్రేహౌండ్స్ నందు అసాల్ట్ కమాండర్ గా, అసిస్టెంట్ ఎస్పీగా రంపచోడవరం నందు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు ,యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రజలను నక్సల్స్ వైపు ప్రభావితం కాకుండా సరైన మార్గంలో నడిపిస్తూ అనతి కాలంలోనే వారి మన్నలను పొందారు.నర్సీపట్నం నందు అసిస్టెంట్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి నేరా నియంత్రణలో తనదైన శైలిలో గంజాయి, అక్రమ రవాణా, వివిధ రకాల నేరస్తులపై ఉక్కుపాదం మోపి శాంతి భద్రతల పరిరక్షణలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.
ఈ సందర్భంగా మీడియాతో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణామాట్లాడుతూ..ముఖ్యమంత్రి మరియు డిజిపి నాపై నమ్మకం ఉంచి నాకు అప్పగించిన బాధ్యతలను 100% సమర్థవంతంగా నిర్వహించి జిల్లా ప్రజలకు పోలీసు శాఖకు మంచి పేరు తెచ్చేలా పనిచేస్తానని ,మహిళలపై జరిగే నేరాల నిర్మూలన, మహిళా సమస్యల పరిష్కారానికి అధికప్రాధాన్యతను ఇస్తూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని,ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా ప్రజల సహకారంతో వారి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ద్యేయంగా పనిచేయడం జరుగుతుందని మరియు పోలీసులు వారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి ఉంచడం జరుగుతుందని , పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఇందుకు మీడియా సహకారం అందించాలని తెలియజేశారు.

---

# మాజీ సీఎం జగన్ మకాం బెంగళూరుకు మార్చినట్టేనా.?



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 15:
వైసీపీ అధినేత, పులివెందుల ఎమ్మెల్యే జగన్ బెంగుళూరుకు మకాం మార్చారా? అసెంబ్లీ సమావేశాలకు డుమ్మా కొట్టినట్టేనా? పార్టీ బాధ్యతలు ఎవరు తీసుకుంటారు?జాతీయ రాజకీయ పార్టీల నేతలతో మంతనాలు కోసమే బెంగుళూరు వెళ్తున్నారా? ఇలా రకరకాల ప్రశ్నలు పార్టీ నేతలను వెంటాడుతున్నాయి.
జగన్ నిర్ణయాలు పార్టీ నేతలకు అంతుబట్టదు. ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో తెలీక నేతలు షాకైన సందర్భాలు లేకపోలేదు. అందుకే ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. నేతలు ఓకే అంటారో తప్పా.. నో అన్న సందర్భాలు అస్సలు లేవు. ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత అయితే పులివెందుల లేదంటే బెంగుళూరులో మాత్రమే ఉంటున్నారాయన.
సోమవారం నుంచి తాడేపల్లిలో తన క్యాంపు ఆఫీసులో ప్రజాదర్బార్ నిర్వహించాలని జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పార్టీ శ్రేణులకు సమాచారం ఇచ్చారు. ముఖ్యంగా పార్టీలోని దిగువ శ్రేణి నేతలతో కలిసే ఈ కార్యక్రమాన్ని రూపొందించింది ఆ పార్టీ. అయితే ప్రారంభానికి ముందే ఈ కార్యక్రమం వాయిదా పడినట్టు తెలుస్తోంది.
సోమవారం బెంగుళూరు వెళ్తున్నారు మాజీ సీఎం జగన్. వారం రోజులపాటు అక్కడే ఆయన ఉండనున్నా రు. వివిధ పార్టీల జాతీయ నేతలతో ఆయన మంతనాలు సాగించే అవకాశముందని తెలుస్తోంది. పాత కేసులు బయటకు రాకుండా, కొత్త కేసులు నమోదు కాకుండా ఉండేలా ఆయన స్కెచ్ వేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బెంగుళూరులో ఉన్న బీజేపీ నేతలతో రహస్యంగా మంతనాలు సాగిస్తున్నట్లు పార్టీ అంతర్గత సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన బెంగుళూరుకు వెళ్తున్నట్లు సమాచారం.
జూన్ 24న బెంగళూరు వెళ్లారాయన. ఈనెల 1 వరకు అక్కడే ఉండి వచ్చారు. మళ్లీ రెండు వారాల వ్యవధిలోనే మరోసారి అక్కడికి వెళ్తున్నారు. ఈనెల 22 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలు కానున్నాయి. ఈ నేపథ్యంలో సమావేశాల ప్రారంభం నాటికి ఆయన వస్తారా? లేదా అన్నది డౌట్ గానే ఉందని ఆ పార్టీ నేతల చెబుతున్నమాట. ఆ పార్టీ నేతగా ఇప్పటివరకు ఎవర్నీ ఎన్నుకోలేదు. దీంతో ఆ పార్టీలో అంతర్గతంగా ఏదో జరుగుతోందన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్లో జోరుగా సాగుతోంది.

---

# ఉపాధి వేతన వృద్ధిరేటు పెంచండి.

**-మధ్యాహ్న భోజన పథక అమలు విధానాన్ని పరిశీలించండి.**
**-సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 15:
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సగటు దినసరి కూలీ 300 రూపాయల కూలీ మొత్తానికి చేరుకునేలా పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీఓలు, సంబంధిత ఎపిడిలను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో ప్రజా సమస్య పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎ పద్మజ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ దినసరి సగటు వేతనం 239 రూపాయలకు మించడం లేదని కేంద్ర ప్రభుత్వం 300 రూపాయలు మంజూరు చేసినప్పటికీ... ఆ మేర పనులు కల్పించడంలో విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా ఉపాధి సగటు దినసరి కూలి 250 రూపాయల వేతనాన్ని అధిగమించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోలు, సంబంధిత ఎపిడిలను ఆమె ఆదేశించారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న మెటీరియల్ కాంపోనెంటుతో లేబర్ కాంపోనెంట్ కూడా నష్టపోతున్నామనే విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఉపాధి వేతన దినసరి కూలీల మంజూరులో రాష్ట్రంలోనే మన జిల్లా దిగువ నుండి మూడో స్థానంలో ఉందన్నారు. ఫీడర్ చానళ్లు, ఫారం ఫాండ్స్ పనులు కల్పించి దినసరి కూలీ రేటు పెంచాలన్నారు. జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి అనుకూలంగా ఉందని మొక్కల పెంపకాన్ని ఉపాధి హామీ కింద చేపట్టాలని ఆమె పేర్కొన్నారు. 76 లక్షల పని దినాల లక్ష్యానికి గాను 46 లక్షల పని దినాలు మాత్రమే సాధించామని అడిగిన వారందరికీ పనులు కల్పించి... కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి కోటి దినాలు కల్పించే దిశలో డ్వామా అధికారులు, ఎంపీడీఓలు పనిచేయాలని ఆమె ఆదేశించారు.వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కౌలు రైతులకు సంబంధించి సీసీఆర్సీ కార్డుల 22,780 లక్ష్యానికి గాను రెన్యువల్స్ 9.8 శాతం మాత్రమే అయ్యాయని...130 కోట్ల రుణాలు ఇవ్వాల్సిన నేపథ్యంలో ఈ నెలాఖరులోగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సంబంధిత వ్యవసాయ అధికారులు, తాసీల్దారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్నం భోజన పథక అమలు పనితీరు పర్యవేక్షించి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని ఎంపీడీవోలు, తాసిల్దారులను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో దాదాపు 100 మంది పిల్లల గైర్హాజరవుతున్నారని సంబంధిత ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులను విచారించారా లేదా ఎలాంటి చర్యలు చేపట్టారు... సంబంధిత నివేదికలు అందజేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి సంబంధిత అధికారుల నోటీసులో లేకుండా ప్రతికూల వార్తలు వస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.